## క్లుప్తంగా

### ఘనంగా శంకర విజయేంద్ర సరస్వతీ స్వామి పూజా కార్యక్రమాలు



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్‌లోని కంచి కామకోటి పీఠ పాలిత వెంకటేశ్వరస్వామి దేవాలయ ఆవరణలో భారతీ ధార్మిక విజ్ఞాన్ పరిషత్ ఆధ్వర్యంలో మంగళవారం కంచి కామకోటి శంకరాచార్య శంకర విజయేంద్ర సరస్వతి స్వామి మహాత్రిపుర సుందరీదేవి సమేత చంద్ర మౌళీశ్వరస్వామి త్రికాల పూజలు, చండీయాగం, స్వామి అనుగ్రహ భాషణం, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈనెల 10 నుంచి 13వ తేదీ వరకు అత్యంత వైభవంగా పూజా కార్యక్రమాలు జరుగుతాయని జనచైతన్య హౌసింగ్ ప్రై.లిమిటెడ్ డైరెక్టర్ మాదల రత్నగిరిబాబు తెలిపారు. కార్యక్రమంలో జనచైతన్య హౌసింగ్ ప్రై.లిమిటెడ్ డైరెక్టర్ మాదల శకుంతల, ఎండీ మాదల సుధాకర్ పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

### దేశం దశ దిశ మార్చేది ఆమ్ ఆద్మీ పార్టీనే

గుంటూరు మెడికల్: ప్రస్తుత రాజకీయ వ్యవస్థలో మార్పుకు నాంది పలికి, దేశం దశ దిశ మార్చేది ఆమ్ ఆద్మీ పార్టీనేనని పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ టి.సేవకుమార్ అన్నారు. ఆమ్ ఆద్మీ పార్టీకి కేంద్ర ఎన్నికల సంఘం జాతీయ పార్టీ హోదా ప్రకటించిన సందర్భంగా మంగళవారం డాక్టర్ సేవకుమార్ మాట్లాడారు.

### ఏఎన్‌యూలో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు

ఏఎన్‌యూ: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని యూనివర్సిటీ అంబేడ్కర్ అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలు మంగళవారం నిర్వహించారు. విద్యార్థుల నుంచి అనూహ్య స్పందన లభించింది. విజేతలకు బుధవారం జరిగే డాక్టర్ అంబేడ్కర్ జయంతి ముందస్తు వేడుకలలో బహుమతులు అందజేయడం జరుగుతుందని అధ్యయన కేంద్రం ప్రొఫెసర్ వై.అశోక్ కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.అబ్రహం లింకన్ తెలిపారు.

### మహిళపై దాడిచేసిన వ్యక్తి అరెస్టు

గుంటూరు ఈస్ట్: మహిళపై కత్తితో దాడిచేసిన వ్యక్తిని పట్టాభిపురం పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. విద్యానగర్ 3వలైనులో నివసించే అక్కినేని సౌజన్యను ఈనెల 3వ తేదీ ఇంట్లో పనిచేసే నూజివీడుకు చెందిన ఎం.వెంకటేష్ కత్తితో పొడిచి గాయపరిచాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన పోలీసులు నిందితుడిని మంగళవారం అరెస్టు చేశారు.

### అలరించిన సందేశాత్మక, హాస్య నాటికలు



నగరంపాలెం: స్థానిక కొరిటెపాడు ఎల్‌వీఆర్ క్లబ్, రీడింగ్ రూమ్‌లో కైకాల సత్యనారాయణ/తమ్మారెడ్డి చలపతిరావు కళా ప్రాంగణంపై వైష్ణవి ఫిలిమ్స్, కళా విపంచి, గుమ్మడి శ్రీమన్నారాయణ కళా సమితి, గుంటూరు ఎన్టీఆర్ కళాపరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం నాటకోత్సవాలు ప్రారంభమయ్యాయి. కళాసాధ అధ్యక్షులు బి.వేదయ్య, ఎల్‌వీఆర్ క్లబ్, రీడింగ్ రూమ్ కళలు, వైజ్ఞానిక సాంస్కృతిక విభాగం పాలకవర్గ సభ్యులు రామ కృష్ణప్రసాద్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. రామకృష్ణప్రసాద్ మాట్లాడుతూ ఈనెల 17 వరకు నాటకోత్సవాలు కొనసాగుతాయని, బుధవారం హైదరాబాద్ వారి గ్రహణం, పొన్నూరు వారి కాపలా నాటికలు ప్రదర్శితమవుతాయని అన్నారు. వై.కే.నాగేశ్వరరావు ద్వితీయ నాటకోత్సవాల్లో భాగంగా గోపరాజు దర్శకత్వం వహించిన కొలకలూరి ఆర్ట్స్ వారి గమ్యస్థానాల వైపు అనే నాటిక సందేశాత్మకంగా ప్రదర్శించారు. అనంతరం పండు క్రియేషన్స్ వారి గోవిందరాజుల నాగేశ్వరావు రచించగా, బాలినేని నాగేశ్వరరావు దర్శకత్వం వహించిన కొప్పోలువారి పక్కింటి మొగుడు అనే హాస్య నాటిక ప్రేక్షకులను అలరించింది.

### ఏపీపీఎస్సీ వార్షిక క్యాలెండర్ విడుదల చేయాలి

గుంటూరు ఎడ్యుకేషన్: గ్రూప్-2తో పాటు వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీలను భర్తీ చేసేందుకు ఏపీపీఎస్సీ వార్షిక క్యాలెండర్ విడుదల చేయాలని ఏపీపీఎస్సీ సభ్యుడు సలాంబాబుకు ఏపీ నిరుద్యోగ ఐక్యవేదిక కన్వీనర్ కొల్లికొండ వెంకట సుబ్రహ్మణ్యం విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం విజయవాడలోని ఏపీపీఎస్సీ కార్యాలయంలో సలాంబాబును కలసి వినతి పత్రం సమర్పించారు. నాలుగేళ్లుగా లక్షలాది మంది నిరుద్యోగులు గ్రూప్-2 ఉద్యోగాల భర్తీ కోసం ఎదురు చూస్తున్నారని, వాటిని భర్తీ చేసేందుకు తక్షణమే నోటిఫికేషన్లు విడుదల చేయాలని కోరారు. సలాంబాబును కలిసిన వారిలో కేవీ ప్రవీణ్, రవికుమార్, భరత్, శ్రీనివాస్ రెడ్డి ఉన్నారు.



వైఎస్సార్ సీపీ ప్రాంతీయ కార్యాలయంలో పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు డొక్కా



పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్



పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న తూర్పు ఎమ్మెల్యే ముస్తఫా

# సమాజ శ్రేయస్సుకు పాటుపడిన పూలే

**మాజీ ఎమ్మెల్సీ డొక్కా**

పట్నంబజారు: సమాజ శ్రేయసుకు పాటుపడిన మహనీయుడు జ్యోతిరావుపూలే అని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్ చెప్పారు. బృందావన్ గార్డెన్స్‌లోని వైఎస్సార్ సీపీ ప్రాంతీయ కార్యాలయంలో మంగళవారం 'జగనన్న నవోత్సవాల్లో భాగంగా జగనన్న పాలనలో బీసీ సంక్షేమ సంస్కరణలు' అనే అంశంపై సమావేశం నిర్వహించారు. సమావేశానికి కార్పొరేటర్ మల్లిబోయిన శ్రీవల్లి అధ్యక్షత వహించారు. డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ తన గురువు పూలే అని చెప్పిన విషయాన్ని ధనుంజయకీర్ వ్యాఖ్య రచనలో పొందుపరిచారన్నారు. మహనీయుల ఆదర్శాలను స్ఫూర్తిగా తీసుకుని రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పాటు పడుతున్నారని చెప్పారు. కష్టపడి పని చేసే కార్యకర్తకు పార్టీ అనివేళలా అండగా ఉంటుందని పేర్కొన్నారు. బడుగు వర్గాలకు అన్ని రంగాల్లో పెద్ద పీట వేస్తూ విద్య ద్వారానే సమాజానికి మేలు జరుగుతోందని గుర్తించి విద్యతోపాటు, మహిళలకు సమాన ప్రాధాన్యం ఇస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతోందన్నారు. వైఎస్సార్ సీపీలో చిన్నా, పెద్ద అనే తేడా లేదని, రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి నిర్ణయం తప్ప, మరే ఒక్కరి పెత్తనం ఉండదన్న విషయాన్ని గుర్తించాలని వివరించారు. పార్టీ కేంద్ర కార్యనిర్వాహక మండలి సభ్యులు, టీటీడీ ప్రత్యేక ఆహ్వానితులు తాడిశెట్టి మురళీమోహన్ మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు బీసీలను ఓటు బ్యాంకులా చూస్తే, సీఎం జగన్ సమాజానికి బ్యాక్‌బోన్ అని చాటి చెప్పారన్నారు. 2014 ఎన్నికల్లో విజయం సాధించిన తరువాత కనీసం బీసీలకు ప్రాధాన్యం ఇవ్వకుండా చూసిన వ్యక్తి చంద్రబాబు అయితే, అన్ని రంగాల్లో 50 శాతం బీసీలకు అగ్రతాబూలం ఇస్తున్న పెద్ద మనస్సు ఉన్న వ్యక్తి సీఎం జగన్ అని కొనియాడారు. తొలుత మహాత్మ జ్యోతిరావుపూలే, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు ఆవుల సుందరరెడ్డి, పెరికల కృష్ణమోహన్, మీరావలి, మాదా రాధాకృష్ణమూర్తి, నాగమల్లేశ్వరరావు, మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి, నాలాది ప్రభాకర్, గనిక ఝాన్సీ, పిచుకలగుంట కృష్ణ పాల్గొన్నారు.



పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న మేయర్ కావటి

**పూలే ఆశయ సాధనకు కృషి చేయాలి**

గుంటూరు ఈస్ట్: పొన్నూరురోడ్డులోని విద్యుత్ భవన్‌లో మంగళవారం మహాత్మ జ్యోతిరావుపూలే జయంతి కార్యక్రమం నిర్వహించారు. సీపీడీసీఎల్ డైరెక్టర్ జయభారత్‌రావు, సూపరింటెండెంట్ ఇంజినీర్ ఎం.మురళీకృష్ణయాదవ్‌లు జ్యోతి రావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పూలే విశేష కృషి చేశారన్నారు. నేటి యువత పూలేను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. విద్యద్వారానే అభివృద్ధి సాధించగలమని పూలే విద్య కోసం కృషి చేశారన్నారు. బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పరిశ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జ్యోతిరావు పూలే ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రమేష్, ఏవో కృష్ణారెడ్డి, నాయకులు ఎస్. చెన్నకేశవ రావు, నాగేశ్వరచారీ, కె.వెంకటేశ్వరరావు, మహేశ్వర రావు, దాసుబాబు, కె.సారథి, తదితరులు పాల్గొన్నారు.

**స్ఫూర్తి ప్రదాత జ్యోతిరావు పూలే..**

ఏఎన్‌యూ: స్ఫూర్తి ప్రదాత మహాత్మా జ్యోతిరావ్ పూలే అని ఏఎన్‌యూ వైస్ చాన్సలర్ పి.రాజశేఖర్ అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ మహాత్మా జ్యోతిరావ్ పూలే అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో పూలే జయంతి వేడుకలు మంగళవారం నిర్వహించారు. తొలుత వర్సిటీలోని పూలే విగ్రహానికి, సమావేశ మందిరంలో పూలే చిత్రపటానికి వీసీ, యూనివర్సిటీ అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అతిథిగా హాజరైన కరీంనగర్ శాతవాహన యూనివర్సిటీ అధ్యాపకురాలు ఆచార్య ఎస్.సుజాత ప్రసంగిస్తూ కట్టుబాట్లు, సంప్రదాయాల పేరుతో నాడు జరిగిన వివక్షత, వేధింపుల నుంచి మహిళలను కాపాడిన వీరుడు పూలే అన్నారు. ఆయన సిద్ధాంతాలను సమాజానికి చేరువ చేయడానికి అధ్యయన కేంద్రాలు కృషి చేయాలని సూచించారు. మానవత్వానికి మించిన గొప్ప శక్తి లేదని పూలే నిరూపించారన్నారు. ఏఎన్‌యూ పూలే అధ్యయన కేంద్రం డైరెక్టర్ ఆచార్య త్రిమూర్తిరావు అధ్యయన కేంద్రం నివేదికను సమర్పించారు. ఏఎన్‌యూ రెక్టార్ పి.వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ కరుణ, పాలకమండలి సభ్యురాలు సరస్వతి రాజు అయ్యర్, యూనివర్సిటీ అధికారులు సీహెచ్ స్వరూపరాణి, గంగాధరరావు, జాన్సన్, సిద్ధయ్య, సునీత, కె.మధుబాబు, డాక్టర్ బి.నాగరాజు, డాక్టర్ జి.చెన్నారెడ్డి, ఎల్.ఉదయకుమార్, ఏపీ బాలల హక్కుల కమిషన్ సభ్యుడు డాక్టర్ రాజేంద్రప్రసాద్, బీసీ ఉద్యోగుల సంఘ నాయకుడు ఉమామహేశ్వర రావు ప్రసంగించారు.

**పీడిత వర్గాల ఆశాజ్యోతి..**

గుంటూరు మెడికల్: దేశంలో అట్టడుగు, పీడిత వర్గాల అభ్యున్నతికి, మహిళల విద్యా వ్యాప్తికి జ్యోతి రావు పూలే ఎనలేని కృషి చేశారని వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మద్దు ప్రేమజ్యోతి బాబు అన్నారు. మంగళవారం జీజీహెచ్‌లోని యూనియన్ కార్యాలయంలో మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి నిర్వహించారు. చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నవ్యాంధ్ర దళిత బహుజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డొక్కా జార్జి, వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ నాయకులు సుబ్బారావు, రాజారావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

**ఎమ్మార్పీస్ ఆధ్వర్యంలో..**

నెహ్రూనగర్: మహాత్మ జ్యోతిరావుపూలే జయంతిని స్వర్ణాంధ్ర ఎమ్మార్పీస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు ఏసుబాబు, సంఘ నాయకులు రాజేష్, అబ్రహాం, సురేష్, సుబ్బయ్య, రవి, ప్రసాద్ పాల్గొన్నారు.

**భీమ్ భారత్ ఆధ్వర్యంలో..**

భీమ్ భారత్ ఆధ్వర్యంలో జయంతి నిర్వహించారు. ట్రావెలర్స్ బంగ్లా వద్ద నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు పాగళ్ల ప్రకాష్ పాల్గొన్నారు.

**బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో..**

బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి మహాత్మ జ్యోతిరావుపూలే ఎనలేని కృషి చేశారని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు తెలిపారు. చుట్టుగుంటలోని సంఘ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు కుమ్మర క్రాంతికుమార్, అన్నవరపు నాగమల్లేశ్వర రావు పాల్గొన్నారు.

**యువతకు ఆదర్శం...**

నెహ్రూనగర్: మహాత్మా జ్యోతి రావు పూలే ఆశయాలు నేటి యువతకు ఆదర్శమని నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు తెలిపారు. మహాత్మాజ్యోతి రావు పూలే జయంతిని పురస్కరించుకొని మున్సిపల్ ట్రావెలర్స్ బంగ్లా వద్ద ఉన్న పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ మహాత్మా జ్యోతి రావు పూలే అంటరానితనం, కులవ్యవస్థ నిర్మూలనతో పాటు మహిళోద్ధరణకు ఎనలేని కృషి చేశారన్నారు. బాల్యవివాహాలకు వ్యతిరేకంగా ఉద్యమించి, వితంతు వివాహాలను ప్రోత్సహించారన్నారు. నేటి యువత ఆయనను ఆదర్శంగా తీసుకొని ఆయన బాటలో పయనిస్తూ, సామాజిక అసమానతలను రూపుమాపాలన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ వనమా బాల వజ్ర బాబు పాల్గొన్నారు.

**జిల్లా గ్రంథాలయంలో..**

గుంటూరు ఎడ్యుకేషన్: అణగారిన వర్గాల అభ్యున్నతికి పాటుపడిన మహనీయుడు పూలే అని జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్ పేర్కొన్నారు. మంగళవారం అరండల్‌పేటలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో మహాత్మా జ్యోతిరావ్ పూలే జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రంథ పాలకులు చిన్నపరెడ్డి, దుర్గారెడ్డి, ఎం.సీ తారామయ్య పాల్గొన్నారు.

**హిందూ కళాశాల కూడలిలో..**

పట్నంబజారు: స్థానిక హిందూ కళాశాల కూడలిలోని మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహానికి వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కామాణిక్య వరప్రసాద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల కోసం పాటుపడిన పూలే చిరస్మరణీయులన్నారు. కార్యక్రమంలో పార్టీ కేంద్ర కార్యనిర్వాహక మండలి సభ్యుడు తాడిశెట్టి మురళీమోహన్ పాల్గొన్నారు.

**ఎమ్మెల్యే ముస్తఫా కార్యాలయంలో..**

జ్యోతిరావుపూలే జయంతి పురస్కరించుకుని తూర్పు ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

**బీజేపీ ఆధ్వర్యంలో..**

గుంటూరు మెడికల్: జ్యోతిరావు పూలే జయంతిని బీజేపీ తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల కన్వీనర్లు శనక్కాయల ఉమాశంకర్, తోట రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ట్రావెలర్స్ బంగళాలో పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ కేంద్ర కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ వల్లూరు జయప్రకాష్ నారాయణ, ఓబీసీ మోర్చా కల్లుగీత కార్మికుల రాష్ట్ర కన్వీనర్ అనుమోలు ఏడుకొండలు గౌడ్ పాల్గొన్నారు. కార్యక్రమంలో పాలపాటి రవికుమార్, ఈమని మాధవరెడ్డి, అప్పిశెట్టి రంగ, నాగమల్లేశ్వరి, సురేష్ జైన్, సుధాకర్, వెంకట రమణ, చలపతి, బొలగాని సాంబయ్య, వెలగలేటి గంగాధర్ పాల్గొన్నారు.

**పూలే సర్కిల్‌గా నామకరణం చేయాలి**

గుంటూరు ఎడ్యుకేషన్: హిందూ కళాశాల సెంటర్‌కు జ్యోతిరావ్ పూలే సర్కిల్‌గా నామకరణం చేయాలని బీసీ ఉద్యోగ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు గుంటుపల్లి శివపూర్ణయ్య, జిల్లా అధ్యక్షుడు మేకల సుబ్బారావు పేర్కొన్నారు. మంగళవారం మహాత్మా జ్యోతిరావ్ పూలే జయంతి సందర్భంగా హిందూ కళాశాల సెంటర్లోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా బీసీ ఉద్యోగ సమాఖ్య రాష్ట్ర గౌరవాధ్యక్షుడు పీవీ రమణయ్య మాట్లాడుతూ భారత ప్రథమ సామాజిక తత్వవేత్త, మొట్టమొదటి మహాత్మ బిరుదాంకితుడు జ్యోతిరావ్ పూలేను రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్వయంగా తన గురువు అని ప్రకటించుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కె. నరసింహారావు, వరికల్లు శ్రీనివాస్ పాల్గొన్నారు.

**జిల్లా పోలీస్ కార్యాలయంలో..**

నగరంపాలెం: జిల్లా పోలీసు కార్యాలయ (డీపీఓ) ఆవరణలో మంగళవారం మహాత్మ జ్యోతిరావుపూలే జయంతి వేడుకలు జరిగాయి. జిల్లా కె.ఆరిఫ్‌హఫీజ్ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఎస్పీ ఎ.శ్రీనివాస రావు (క్రైం), ఎస్‌బీ సీఐలు బి.నరసింహారావు, శ్రీనివాసరావు, ఆర్ఐలు థామస్‌రెడ్డి, రాజారావు, రాఘవయ్య, రమేష్‌కృష్ణన్ పాల్గొన్నారు.



పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న జయభారత్‌రావు, మురళీకృష్ణయాదవ్ తదితరులు



వర్సిటీలో పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వీసీ రాజశేఖర్ తదితరులు



పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ట్రేడ్ యూనియన్ నేతలు



చుట్టుగుంటలోని సంఘ కార్యాలయంలో పూలే చిత్రపటం వద్ద బీసీ సంఘ నాయకుల నివాళి



జ్యోతిరావ్ పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బీసీ ఉద్యోగ సమాఖ్య నాయకులు



పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జిల్లా ఎస్పీ ఆరిఫ్‌హఫీజ్

## సీఎం జగన్ పాలనలో అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి

**తూర్పు ఎమ్మెల్యే ముస్తఫా**

పట్నంబజారు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూరి, వారి అభ్యున్నతికి తోడ్పాటునందించిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి అని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా చెప్పారు. మంగళవారం నియోజకవర్గంలోని ఏడో డివిజన్ పొత్తూరివారి పేటలో డెప్యూటీ మేయర్ షేక్ సజిల ఆధ్వర్యంలో 'జగనన్నే మా భవిష్యత్ - మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సీఎం వై.ఎస్.జగన్ అందిస్తున్న పథకాలను వివరించి, ప్రజల అభిప్రాయాలను సేకరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో బడుగు, బలహీన వర్గాల ప్రజలు అభివృద్ధి చెందారని, గత ప్రభుత్వంలో పేదలను పట్టించుకోలేదని విమర్శించారు. గత ప్రభుత్వ పాలనకు వైఎస్సార్‌సీపీ పాలనకు ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలకు వివరిస్తున్నట్లు తెలిపారు. ఇంటి యజమానుల అనుమతితో మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లు అంటించారు. అనంతరం 51వ డివిజన్ శ్రీనగర్‌లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో ఎమ్మెల్యే ముస్తఫా పాల్గొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ పరిశీలకులు అడపా శేషు, పార్టీ నేతలు షేక్ షౌకత్, కిషోర్, శ్రీలక్ష్మి, నాగరాజు, శ్రీనివాసరావు, సుబ్బులు, చన్నుపాటి వెంకటరమణ, శ్రీనివాసరావు, వెంకట్రావు, భాస్కర్ పాల్గొన్నారు.



ప్రజాభిప్రాయాలు సేకరిస్తున్న ఎమ్మెల్యే ముస్తఫా, పక్కన డెప్యూటీ మేయర్ సజిల

### విశ్రాంత ఉద్యోగిని మోసం చేసిన వ్యక్తి అరెస్టు

గుంటూరు ఈస్ట్: విశ్రాంత ఉద్యోగితో స్నేహంగా మెలుగుతూ రూ.67 లక్షలు కాజేసిన వ్యక్తిపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. జేకేసీ కాలేజీ రోడ్డులో నివసించే విశ్రాంత ఉద్యోగి వీరబ్రహ్మేశ్వరరావు నివాసం ఉంటున్నాడు. చిల్లర వెంకటేశ్వరరావు అనే వ్యక్తి బ్రహ్మేశ్వరరావుతో స్నేహంగా మెలుగుతూ మాయమాటలు చెప్పి చెక్‌బుక్ తీసుకుని ఫోర్జరీ సంతకాలు చేసి బ్యాంకు నుంచి బ్రహ్మేశ్వరరావు అకౌంట్‌లోని రూ.67 లక్షలు డ్రా చేశాడు. ఆలస్యంగా గుర్తించిన బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన అనంతరం మంగళవారం నిందితుడు వెంకటేశ్వరరావును అరెస్టు చేసి ల్యాప్‌ట్యాప్, కొన్ని చెక్కులు, రూ.55 వేలు, రూ.50వేలు ఫిక్స్‌డ్ డిపాజిట్ స్వాధీనం చేసుకున్నారు.

## సర్వమత సమానత్వానికి ప్రతీక ఇఫ్తార్

గుంటూరు ఎడ్యుకేషన్: పవిత్ర రంజాన్ మాసంలో ఇఫ్తార్ సర్వమత సమానత్వానికి ప్రతీక అని భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ పేర్కొన్నారు. మంగళవారం గోరంట్లలోని భాష్యం టెన్త్ క్యాంపస్‌లో రామకృష్ణ ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు ఆచరిస్తున్న ముస్లింలు అల్లాహ్ ఆశీస్సులు పొంది, ఆయురారోగ్యాలు, సంపదలతో సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు. ముస్లిం మత పెద్ద మొహ్మద్ అబీద్ బాషా ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో రామకృష్ణ పాల్గొన్నారు. ఈసందర్భంగా ముస్లిం మత పెద్దలు ఉపవాస దీక్ష చేసే వారికి ఇఫ్తార్ విందు ఇవ్వడం వలన వారితో సమానంగా అల్లాహ్ నుంచి పుణ్యం లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో భాష్యం విద్యాసంస్థల డైరెక్టర్ భాష్యం హనుమంతరావు పాల్గొన్నారు.



ముస్లింలతో కలసి ప్రార్థన చేస్తున్న భాష్యం రామకృష్ణ

## మజ్జిగ పంపిణీ అభినందనీయం

నగరంపాలెం: వాసవీ క్లబ్ గుంటూరు కింగ్స్/వాసవీ క్లబ్ గుంటూరు క్వీన్స్ ఆధ్వర్యంలో గుంటూరు ఫ్యాన్సీ అసోసియేషన్ సౌజన్యంతో మంగళవారం కొత్తపేటలోని ఫ్యాన్సీ కల్యాణ మండపం వద్ద ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని డెప్యూటీ మేయర్ షేక్ సజీల ప్రారంభించారు. గత 13 రోజులుగా కొనసాగుతున్న పంపిణీ కార్యక్రమాన్ని ఆమె అభినందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు షేక్ షౌకత్, పట్టణ ఫ్యాన్సీ అసోసియేషన్ పీఎస్‌టీలు ప్రభాకర్, దామోదర్, విశ్వేశ్వరరావు, ఆర్‌ఎస్.మూర్తి, వెంకటేశ్, రంగచంద్రశేఖర్ పాల్గొన్నారు.

## నలభై మొబైల్‌ఫోన్లు అప్పగింత

నగరంపాలెం: మొబైల్‌ఫోన్లను పోగొట్టుకున్న బాధితులకు అప్పగించే ప్రక్రియ కొనసాగుతుందని జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్ అన్నారు. నలభై మంది బాధితులకు పోగొట్టుకున్న మొబైల్‌ఫోన్లను మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయం (డీపీఓ) ఆవరణలో ఎస్పీ ఆరిఫ్‌హఫీజ్ అందించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా బాధితులు ఉన్నట్‌లైతే జిల్లా పోలీస్ వాట్సాప్ నంబర్ 8688831574కు హాయ్ అని మెసేజ్ పంపించాలని అన్నారు. తద్వారా ప్రత్యేక పోలీస్ బృందంతో మొబైల్‌ఫోన్లను గుర్తిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్పీలు కె.సుప్రజ (పరిపాలన), ఎ.శ్రీనివాసరావు (క్రైం), ఎస్‌బీ సీఐ శ్రీనివాసరావు, ఆర్ఐ థామస్‌రెడ్డి, ఐటీ కోర్ ఇన్‌చార్జి ఎస్ఐ వెంకటకృష్ణ పాల్గొన్నారు.



బాధితులకు మొబైల్‌ఫోన్లను అప్పగించిన జిల్లా ఎస్పీ ఆరిఫ్‌హఫీజ్

**బదిలీపై వెళ్తున్న ఐజీని కలిసిన జిల్లా ఎస్పీ**

విశాఖపట్నం సిటీ కమిషనర్‌గా బదిలీపై వెళ్తున్న గుంటూరు రేంజ్ ఐజీ డాక్టర్ సి.ఎం.త్రివిక్రమవర్మను మంగళవారం కలెక్టరేట్ రోడ్‌లోని ఆయన బంగ్లాలో జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్ మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

## రూ.లక్ష విరాళం అందజేత



చెక్కు అందజేస్తున్న రంగారావు, శేషారత్నం

గుంటూరు ఎడ్యుకేషన్: ఫార్మకాలజీ విభాగంలో ఉత్తమ ర్యాంకులు సాధించిన ఎం.ఫార్మసీ విద్యార్థులకు బంగారు పతకాలను బహూకరించేందుకు గాను వజ్జా భార్గవి నాగలక్ష్మి మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్, ఏఎన్‌యూ విశ్రాంత ప్రొఫెసర్ వజ్జా రంగారావు, కార్యదర్శి శేషారత్నం కలిసి హిందూ ఫార్మసీ కళాశాలకు రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. మంగళవారం అమరావతిరోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, కరస్పాండెంట్ డాక్టర్ ఎస్. మధుసూదనరావుకు రూ.లక్షను చెక్కు రూపంలో అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ నాగభూషణం, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రవికుమార్, ఫార్మాస్యూటికల్స్ విభాగాధిపతి డాక్టర్ ఎ. సీతాదేవి, ఫార్మాడి డైరెక్టర్ పి. సీతారామయ్య పాల్గొన్నారు.